జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


బుధవారం | 12-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 272 పేజీలు: 4 వెల: రూ.7

# ట్రాఫిక్ పోలీసుల.. అంతులేని కష్టాలు!






* అయిన వారికి స్టేషన్‌లో.. కానివారికి రోడ్డుపైనే డ్యూటీ
* సెలవులు ఇవ్వకుండా ఇబ్బందులు
* అనారోగ్యం పాలైనా డ్యూటీ చేయాల్సిందేనని హుకుం
* ఆయన మాత్రం స్టేషన్‌కే పరిమితం
* రాచకార్యమంతా జీపులోనే
* ఈ అధికారి తీరుపై ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్న కొందరు ట్రాఫిక్ పోలీసులు



**శ్రీకాకుళం క్రైం, మార్చి 11 (వార్త):** పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా ఎస్పీ, యువ ఐపీఎస్ అధికారి కేవీ మహేశ్వరరెడ్డి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి అండగా ఉంటున్నారు. ఏకంగా ఎస్పీయే స్వయంగా పోలీసుల ఇంటికి వెళ్లి పరామర్శించడం, వారి బాగోగులు చూసుకుంటున్నారు. అయితే ఓ సీఐ మాత్రం ట్రాఫిక్ పోలీసులను ఇబ్బందులను గురిచేయడమే ధ్యేయంగా పనిపెట్టుకున్నారు. అయిన వారికి స్టేషన్‌లో డ్యూటీ, కానివారికి రోడ్డుపైనే విధులకు వేస్తూ పైశాచికానందాన్ని పొందుతున్నాడన్న విమర్శలు ఉన్నాయి. టార్గెట్ చేసుకుని మరీ ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్న అపవాదు ఉంది. ఒకరిద్దరిని తన వెంటే ఉంచుకుని ఎటువంటి పనులు అప్పజెప్పడం లేదట. వారే.. ఆయనకు సర్వం. వారేం చెబితే అదే వింటాడని ట్రాఫిక్ పోలీసులు గుసగుసలాడుకుంటున్నారు. సిబ్బంది సెలవులు అడిగినా ఇవ్వడం లేదు. ఇటీవల ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ అనారోగ్యం పాలయ్యాడు. సెలవు కావాలంటే ఇవ్వకపోవడంతో ఆసుపత్రిలో జాయిన్ అయి అక్కడ చికిత్స తీసుకుంటున్న ఫొటోలు ఆ శాఖ వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో సెలవు ఇచ్చారని తెలిసింది. శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో 42 మంది వరకూ విధులు నిర్వహిస్తున్నారు. ఇండోర్‌లో ఆరుగురు సిబ్బందిని విధుల్లో ఉంచుతున్నారు. మిగిలిన వారిని ట్రాఫిక్ డ్యూటీలో వేస్తున్నారు. ఎప్పుడు ఆ ఆరుగురే అక్కడ విధుల్లో ఉంచడం పట్ల ట్రాఫిక్ పోలీసుల మధ్య వాగ్వాదం కూడా తరచూ జరుగుతునే ఉంది. అక్కడి అధికారి మాత్రం అంతా నా ఇష్టం అన్న మాదిరిగా వ్యవహరిస్తున్నాడని ట్రాఫిక్ పోలీసులు వాపోతున్నారు. తమ సమస్యలు చెప్పేందుకు కొందరు ట్రాఫిక్ పోలీసులు ఆయన వద్దకు వెళ్లినా తర్వాత మాట్లాడుదాం, చూద్దాం అంటూ తిప్పుకుంటున్నారని, సమస్యలు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలోనూ, వర్షంలోనూ, దుమ్ముధూళి మధ్య విధులు నిర్వహిస్తూ అనారోగ్యం పాలవుతున్నామని తమ కష్టాలు ఎవరికి చెప్పుకోవాలంటూ ట్రాఫిక్ పోలీసులు వాపోతున్నారు. ఆ సీఐ అలా అలా ఉదయం ఒక రౌండ్, సాయంత్రం ఒక రౌండ్ పోలీసు జీపులో వచ్చి నగరంలో అక్కడక్కడా పర్యటించి, ఆ తర్వాత స్టేషన్‌కే పరిమితమవుతుంటారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై కనీసం పర్యవేక్షించిన దాఖలాలు లేవు. పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్నా ఎందుకో మరి.. అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. కేసులు కట్టడం కన్నా రాజీ చేసేందుకు ఎక్కువగా ఆయన ఆసక్తి చూపుతుంటారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ సీఐ ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో కొందరు ట్రాఫిక్ పోలీసులు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్టు తెలిసింది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సోంపేటలో 13న ఉద్యోగ మేళా

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):**డి.ఆర్.డి.ఏ, సొసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్, ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా ఈ నెల 13న సోంపేటలోని ఎం.ఎం.ఎస్.లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నాయి. ఈ మేళాలో పేటీఎం, నవత రోడ్ ట్రాన్స్పోర్ట్ అనే రెండు ప్రముఖ కంపెనీలు పాల్గొని ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్, వెహికల్ క్లీనర్ వంటి ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నాయి. ఈమేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, డిగ్రీ విద్యార్హతలు కలిగిన 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 11,000 నుండి రూ. 19,500 వరకు వేతనం లభిస్తుంది. ఈ ఉద్యోగ మేళా ఉదయం 9.30 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్ జిరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలు, బయోడేటాతో రావాల్సి ఉంటుంది. మొత్తం 130 ఖాళీలు ఉన్నాయి. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు నాగేశ్వరరావు, 8106508318ను సంప్రదించగలరని సూచించారు.

# జిల్లా అభివృద్ధి లక్ష్యాలను పూర్తి చేయాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ఖాన్తో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, గ్రామ సచివాలయం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గృహ నిర్మాణం, పారిశుద్ధ్యం, అంగన్వాడీ కేంద్రాల పనితీరు వంటి అంశాలపై చర్చించారు."పల్లె పండుగ పనులను త్వరగా పూర్తి చేయాలి. ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలి. గృహ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేయాలి. కాలువలు, చెత్త కుప్పల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధనకు కృషి చేయాలి. అంగన్వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచాలి. కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి. చెత్త నుంచి సంపద షెడ్ల నిర్మాణం పూర్తి చేయని 200 పంచాయతీలు వివరణ ఇవ్వాలి" అని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. "రెవెన్యూ సదస్సులు, రీసర్వే-ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంటి నుండి పని, పి4 సర్వే, ఎంఎస్ఎమ్ఈ సర్వే తదితర అంశాలపై ఆయా అధికారులు సమగ్ర వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షకు ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డిపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, ఐసిడిఎస్ పీడి బి.శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

# పోషకాహారాన్ని అందించడమే లక్ష్యం

**-ప్రభుత్వం నిర్దేశించిన మెనూను**

**సక్రమంగా అమలు చేయాలి**

**-రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు**



**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):**నాణ్యమైన పోషక విలువలతో కూడిన్న ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం శ్రీకాకుళలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు వాహనాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వం బాలికొన్నత పాఠశాలలు రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి కాంతారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు ముందిగా గుడివీధిలో డి సి ఎమ్ ఎస్ డిపో, ఏండియు వాహనాన్ని పరిశీలించారు, అనంతరం డి.సి.ఎమ్.ఎస్ గోదాం పరిశీలించి స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు, అరసవిల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డు పరిశీలించి నిర్వాహనాపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం బలికొన్నత పాఠశాలను సందర్శించి వారికి అందజేస్తున్న మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి విద్యార్థినిలతో ముచ్చటిస్తూ ప్రతీ రోజు అందజేస్తున్న ఆహారం పై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట ఫుడ్ కమిషన్ సభ్యులు బి కాంతారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందనని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ సూర్య ప్రకాష్ రావు, డీఈఓ తిరుమల చైతన్య, ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ, ఫుడ్ ఇన్స్పెక్టర్, తూనికలు కొలతలు శాఖ , సి.ఎస్.డి.టి చక్రవర్తి, ఎండియూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'కేశవరెడ్డి' బాధితులకు న్యాయం చేయండి

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం జిల్లాలలో కేశవరెడ్డి విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు మోసగించారని శాసనసభలో శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ ప్రస్తావించారు. 2010లో ఈ విద్యా సంస్థ ద్వారా విద్యార్థులు జాయిన్ అయ్యారని సుమారు 800 మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశారని అప్పట్లో ప్రతి విద్యార్థి నుంచి రెండు లక్షల నుండి 8 లక్షల వరకు ఫీజుల రూపంలో వసూలు చేశారని మొత్తం 42 కోట్ల మీద కలెక్షన్ చేసి చేతులు ఎత్తేసారని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ప్రోమ్సరీ నోట్లో చెక్కులు, ఇవ్వడం జరిగిందని, దీనిపై కేశవరెడ్డి కుమారుడు భరత రెడ్డి న్యాయం చేస్తానని చెప్పారు కానీ ఎంతవరకు ఎటువంటి న్యాయం జరగలేదని చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఈ విద్యా సంస్థపై 15 కేసులు నమోదయాయని అయినప్పటికీ యాజమాన్యం విద్యార్థుల పట్ల పూర్తి అన్యాయం చేసిందని విద్యార్థులకు తల్లిదండ్రులకు న్యాయం చేయాలని విద్యా శాఖ మంత్రి దీన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. శ్రీకాకుళం అర్బన్ శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల లో .విద్యాసంస్థలు ఉన్నాయని ఇప్పటికైనా విద్యా శాఖ మంత్రి దృష్టపెట్టి విద్యార్థులకు , తల్లిదండ్రులకు న్యాయం చేయాలని దీనిపై విద్యాశాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



## గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్‌గా బుడుమూరు

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):**రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం కోసం జిల్లా, డివిజన్ కన్వీనర్లను ఉద్యమ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివ ప్రసాద్ మంగళవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా విద్యావేత్త బుడుమూరు సూర్యారావును నియమించారు. ఆయన ప్రస్తుతం బూర్జ మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. గ్రంథాలయ వ్యవస్థ పట్ల అభిమానం ఉన్న వారినే ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, వారి వారి రాజకీయ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని శివప్రసాద్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం రెవిన్యూ డివిజన్ కన్వీనర్ గా విద్యావేత్త డాక్టర్ జామి భీమశంకర్ ను, టెక్కలి డివిజన్ కన్వీనర్ గా సీనియర్ జర్నలిస్టు బెండి నర్సింగరావును, పలాస డివిజన్ కన్వీనర్‌గా విద్యావేత్త చాపర వేణుగోపాల్ ను నియమించారు. జిల్లా కమిటీలు డివిజన్ కన్వీనర్లు కూడా సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కే.శ్రీనివాస్, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, న్యాయవాది బొడ్డేపల్లి మోహన్ రావు, విశ్రాంత లైబ్రేరియన్, జర్నలిస్ట్ దూరి గోపాలరావు, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, విద్యావేత్త శాసనపురి మధుబాబు, ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు ఎంవి మల్లేశ్వరరావులను సభ్యులుగా ఎంపిక చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను మరింత పరిపుష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడానికి చేస్తున్న ప్రయత్నమని శివప్రసాద్ అన్నారు. ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా, డివిజన్ కమిటీలు మంచి దృక్పథంతో పనిచేయ గలవన్నా ఆశాభావాన్ని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, కథా నిలయం ప్రతినిధి దాసరి రామచంద్రరావు, శ్రీకాకుళం సాహితీ ప్రతినిధులు, కవులు కంచరాన భుజంగరావు, కలమట దాసుబాబు తదితరులు వ్యక్తం చేశారు.





## బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

**టెక్కలి, మార్చి 11(వార్త):** టెక్కలి నియోజకవర్గంలో బీజేపీని బలోపేతానికి బూత్ కమిటీలు విస్తృతంగా గ్రామాల్లో పర్యటించాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. టెక్కలి రాయల్ కాన్వెంట్స్‌లో ఈ సమావేశం సోమవారం జరిగింది. దీనికి విచ్చేసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావును స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి విజయ కుమార్ రెడ్డి, రాష్ట్ర సెల్స్ డిపార్ట్మెంట్ సభ్యులు పైడి వేణుగోపాలం, జిల్లా మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సువ్వారి ఉమామహేశ్వరి, టెక్కలి నియోజకవర్గం కో కన్వీనర్ నడుపూరి లక్ష్మీనారాయణ, టెక్కలి మండల అధ్యక్షులు జర్జన రాంజీ, కోటబొమ్మాళి మండల అధ్యక్షులు మేట్ట తిరుమలరావు, నందిగాం మండల అధ్యక్షులు ఏదురు కామరాజు. మిలటరీ కెప్టెన్ మెట్ట మన్మథరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, మోర్చా జిల్లా అధ్యక్షులు జన్ని పరమేష్, టెక్కలి మండలం పూర్వపు అధ్యక్షులు గూనా మీనాకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతిరావు, మోహన్ రెడ్డి, టెక్కలి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**మందస, మార్చి 11(వార్త):** రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజు కోరారు. మందస మండలంలోని బుడారిసింగి, తాళ్లగురంటి గ్రామాల్లో రైతులతో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేన రైతును ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి పాస్పుస్తకాలు, ఆధార్కార్డు, మొబైల్ నెంబరు తీసుకెళ్లి, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణాధికా రులు పి.ఉదయ్‌కుమార్, బల్లు జగ్గారావు, కీర్తిసాయి తదితరులు ఉన్నారు.

## మనోజ్‌కు జానపద కళా పురస్కారం

**పలాస, మార్చి 11 (వార్త) :** ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ లో ఈ నెల 8,9 తేదీ లలో జరిగిన తెలుగు మహాసభల్లో జానపద కళాకారుడు శిష్టు మనోజ్ కుమార్‌కు చతిస్గఢ్ జానపద కళా పురస్కారం అందించారు. ఆయన జానపద పాటలు, మాటల తూటాలతో ప్రేక్షకులను ఆద్యంతం ఉర్రూతలూగించారు. దీంతో పురస్కారాన్ని సినీ నటుడు సాయికుమార్ చేతులమీదుగా అందుకున్నారు. మనోజ్ పురస్కారం అందుకోవడంపై గిడుగు రామ్మూర్తి కళా పీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు, ఏపీ జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ నాయక్, డాక్టర్ కూన మోహన్‌బాబు,, పలాస ప్రోగ్రెస్సివ్ ప్రెస్ క్లబ్ అసోసియే షన్ ప్రతినిధులు అంబికాప్రసాద్, నారాయణరావు, చంద్రరావు, ఎన్ అశోక్, ఈశ్వర్ పాత్రో, నగరంపల్లి గ్రామ ప్రజలు, హర్షం వ్యక్తం చేశారు.



## ఆర్‌వోబీ పనులను పరిశీలించిన శివాజీ

**మందస, మార్చి 11(వార్త):** మందస మండలంలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ మంగళవారం పర్యటించారు. హరిపురం సమీపంలో జరుగుఉతన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు చమళ్ళ శంకర్రావు, పులారి యాదవ రావు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలిసి వెళ్లి వారిని కలసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బేతాళపురం, అంబుగాం గ్రామాల్లో ఇటీవల చనిపోయిన కార్యకర్తల కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు భావన దుర్యోధన, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, బైరిశెట్టి గున్నయ్య, కొత్ర ఆనందరావు, మామిడి తాతారావు, సీపాన మోహనరావు, గున్న రామారావు, పాలిన తాతారావు, సూరాడ వాసు, జుత్తు అప్పలస్వామి, దున్న తిరుపతి, చౌదరి మురళీకృష్ణ, మండల లచ్చయ్య, బత్తిన తారక్, కొర్నాన మురళి, రెల్ల శ్రీను పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు, వెనుకబడిన తరగతులు, అగ్ర వర్ణాల్లోని పేదలు, ఈబీసీ, క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ), కుమ్మర మేదర కులముల వారికి స్వయం ఉపాధి పథకాలు స్థాపించుటకు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. డి.ఫార్మసీ/ బి.ఫార్మసీ పూర్తి చేసి ఉన్న నిరుద్యోగ యువతకు జెనిరిక్ ఫార్మసీలు నిమిత్తం, కాపు (కాపు, తెలగ, బలిజ మరియు ఒంటరి) కులములు వారికి స్వయం ఉపాధి పథకములు స్థాపించుటకు రుణాలు ఇవ్వనున్నారు. రుణాలు పొందగోరు అభ్యర్థులు https://apobmms.apcfss.in సైట్ లో మీ సేవా, ఇంటర్నెట్ సెంటర్ లేదా మీ సంబంధిత సచివాలయంలో గానీ ఈ నెల 22లోగా నమోదు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్య నిర్వాహక సంచాలకులు ఆర్.గడ్డెమ్మ తెలిపారు.



## జీడికి కనీస మద్దతు ధర కల్పించాలి

**-అసెంబ్లీలో గళమెత్తిన గౌతు శిరీష**

**పలాస, మార్చి 11(వార్త):** ఉద్దానంలో జీడి పంట పండించే రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. మంగళ వారం అసెంబ్లీ లో ఆమె మాట్లాడుతూ జీడి పంట పండిస్తున్న రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే గత సమావేశాల్లో వ్యవసాయ శాఖామంత్రి దృష్టిలో పెట్టడం జరిగిందని చెప్పారు. మొన్న ఎన్నికల్లో మినిమం సపోర్ట్ ప్రైస్ కి హామీ ఇచ్చామని, వ్యాపార పంటగా పేరుగాంచిన ఉద్దానం జీడి పంట మద్దతు ధర కోసం రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు అన్నారు. మన కూటమి ప్రభుత్వం లో ఉద్దానం జీడి పంట పండించే రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. ఇప్పటికే మనం హామీ ఇచ్చిన జీడి మామిడి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తీసుకుంటారని, మీ ద్వారా మంత్రి సమాధానం చెబుతారని కోరుచున్నాని వెల్లడించారు.




## కిస్టుపురంలో బోరు బావికి మరమ్మత్తులు

**పలాస, మార్చి 11 (వార్త):** పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిస్టుపురం గ్రామంలో బోరుబావికు పాడవడంతో గ్రామానికి ఒక్క బోర్ ఆధారం కావడంతో చాలా కుటుంబాలు తాగునీటికి ఇబ్బంది పడటం చూసి గ్రామ కూటమి నాయకులు సర్పంచ్, సెక్రెటరీలు తెలియజేసారు. సకాలంలో అధికారులు స్పందించడంతో బోరుబావి సాంకేతిక నిపుణుడు జగదీష్ ఆధ్వర్యంలో సమస్య పరిష్కరించి, ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఇందుకు సహకరించిన పంచాయతీ సర్పంచ్, అధికారులకు గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సెక్రెటరీ సాయి, సంతోష్‌రావునాయుడు, బూర్ల కృష్ణంరాజు, బూర్ల విజయ్, బాబురావు ,తులసి రావు, ఆనంద్‌రావు, ఢిల్లీ, ముకుందరావు ,నాగరాజు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**వంగర, మార్చి 11(వార్త):** రేగిడి మండలం బురాడ గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో వంగర మండలం బంగారవలస గ్రామానికి చెందిన వెలగవాడ దాసు 30 కి తలకు గాయాలు అయ్యాయి, తక్షణమే 108 సహాయంతో రాజాం ప్రభుత్వాసుపత్రికి స్థానికులు తరలించారు



## పేదలకు సేవలందించండి

**సంతబొమ్మాళి, మార్చి 11(వార్త):** సమాజంలో నిరుపేదలకు చేయూతనిచ్చి ఆదుకోవడంలో ముందుండాలని డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ యువతకు పిలుపునిచ్చారు. మండలం గోవిందపురం పంచాయతీలో పంగ జగ్గుపేటలో నీలాపు చిన్నమ్మి ఒంటరిగా ఉంటూ కనీసం ఉండటానికి నివాసం కూడా లేదని డాక్టర్ తెలుసుకున్నారు. ఆమె నివాసం ఉండేందుకు రేకుల షెడ్ వేయడానికి పునీత్ రాజ్ కుమార్ అసోసియేషన్ తరుపున రూ.11 వేలునగదు అందించారు. అలానే ఒక నెలకు సరిపడా కిరాణా సరుకులు, ఒక 25 కేజీల బియ్యం ప్యాకెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పునీత్ రాజ్ కుమార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుక్కళ్ళ నాగేంద్ర, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# హెూటళ్లు, లాడ్జిలకు గ్రీన్ లీఫ్ రేటింగ్

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** జిల్లా ఉన్న హెూటళ్లు, లాడ్జిలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వబడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మంగళవారం సమన్వయ హెూటళ్లు, లాడ్జీల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ వినూత్న వ్యవస్థ హెూటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో పరిశుభ్రతను నిర్ధారించడం ద్వారా పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందిస్తుందని, గ్రీన్ లీఫ్ రేటింగ్ ద్వారా కలెక్టర్ బఫర్ గిల్ కెర్ వారికి గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వబడుతుందని ప్రకటించారు. "గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ వివిధ విభాగాలలో అమలు చేయబడుతుందని పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక రంగంలో సురక్షితమైన పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించడానికి ఈ రేటింగ్ వ్యవస్థ ప్రవేశపెట్టబడిందని ఆయన పేర్కొన్నారు." రేటింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయబడుతుందని, కలెక్టర్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య మిషన్, జడ్పీ సీఈవో, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సభ్యులతో కూడిన కమిటీ ఉంటుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శులుగా వ్యవహరిస్తారన్నారు. డివిజన్ స్థాయిలో హెూటళ్లు, లాడ్జీలను తనిఖీ చేయడానికి ఒక ఉప కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీలలో ఉన్న హెూటళ్లు, లాడ్జీల జాబితా గ్రామ పంచాయతీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచబడుతుందన్నారు. జిల్లా స్థాయి శిక్షణను క్రమానుగతంగా నిర్వహిస్తామన్నారు. గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించడంలో సహకరించాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని హెూటళ్లు, లాడ్జీల యాజమాన్యాలకు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య మిషన్ ఎస్ఈ ఎహసాన్ భాషా, జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజ, జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా పర్యాటక అధికారి ఎన్. నారాయణరావు, %వీజుబూ%, వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్, హెూటల్ అసోసియేషన్ స్టేట్ సెక్రెటరీ మెట్ట నాగరాజు, హెూటల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు పోరును విజయవంతం చేయండి



**ఇచ్ఛాపురం, మార్చి11(వార్త):** జిల్లా కేంద్రం లో బుధవారం నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. అద్భుతమైన సంక్షేమ పథకాలను ఇంటికి డోర్ డెలివరీ చేసిన జగనన్నను కాదని, కల్లబొల్లి కబుర్లు చెప్పిన కూటమి నాయకులకు రాష్ట్ర ప్రజలు అండగా నిలబడ్డారు. ఫలితంగా ఈరోజు మరోసారి చంద్రబాబు దగా ప్రభుత్వాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత పోరు కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. నవరత్నాలకు తోడుగా సూపర్ సిక్స్ అంటూ మరో ఆరు హామీలను అదనంగా అమలు చేస్తానని రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు వారసత్వ మోసం చేశారు. మోసపూరిత హామీలతో అధికారం ఎక్కిన చంద్రబాబు ప్రభుత్వానికి నిలదీస్తూ ప్రజల పక్షాన వైకాపా పోరాటం చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి ఈరోజు నిరుద్యోగ యువకులకు నిలువునా ముంచేసారు. వారికోసం ఒక రూపాయి కూడా ఈ బడ్జెట్లో పొందుపరచలేదు, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ చెల్లించకపోవడంతో, ఆ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు తల్లిదండ్రుల పైన తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నాయి. తక్షణమే ఫీజులు చెల్లించాలని అల్టిమేటం జారీ చేస్తున్నాయి. నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులు ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాక, ఈరోజు జగనన్న ప్రభుత్వాన్నిస్మరించుకుంటున్నారు. చంద్రబాబు చేసిన మోసాన్ని దుయ్యబడుతున్నారని అన్నారు. త్రైమాసాలుగా దాదాపు 4600 కోట్ల రూపాయలు కళాశాల యాజమాన్యాలకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ నిధులను వెంటనే విడుదల చేసి, విద్యార్థుల భవిష్యత్తును బాగు చేయాలని వైకాపా డిమాండ్ చేస్తుంది. కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశం విరమించుకోవాలని, పేద విద్యార్థులు కూడా వైద్య వృత్తిలోకి వచ్చే విధంగా వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల, మున్సిపాలిటీ పరిధి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరవ్వాలని వినయపూర్వకంగా విజ్ఞప్తి చేసారు.

# సీదిరీ.. అవాకులు..చెవాకులూ మానుకో

**-మాజీ మంత్రి అప్పలరాజుపై టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు ఆగ్రహం**

**పలాస, మార్చి 11(వార్త):** గడచిన ఎన్నికల్లో చేసిన మోసాలు, చెప్పిన అబద్ధాలను ప్రజలు తెలుసుకుని మాజీ మంత్రి అప్పలరాజును పక్కనపెట్టేశారని, ఆయన వ్యవహారశ్కెలి చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టుగా ఉందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు ధ్వజమెత్తారు. పలాసలోని టీడీపీ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నాశనం చేయడంతో ఆ దుష్ప్రభావం ప్రజలపై పడిరదన్నారు. అందుకే రికార్డుస్థాయిలో ఈ ప్రాంత ప్రజలు ఓడిరచారన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోలేదు సరికదా, ఇంకా ఆ పాతపద్ధతిలోనే లేనివి ఉన్నట్లు ప్రచారం చేస్తూ టీడీపీ నాయకులపై బురద చల్లుకోవడం ఇంకా మానుకోలేదని నిట్టూర్చారు. మీ కుటిల ప్రయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారని, మరింత పలుచన కావద్దని హితవు పలికారు. నిరుద్యోగుల కోసం మీ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమాలు చేసుకోండి... ఉనికిని చాటుకోండి... అంతేకాని ఇష్టానుసారంగా నోటికి పనిచెబితే మాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గతంలో జీడిపప్పుపై అల్లుడు ట్యాక్స్ అని వదంతులు సృష్టించారు.. ఇప్పుడు లిక్కర్‌పై అల్లుడు ట్యాక్స్ అంటూ మళ్లీ నీచవ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అప్పలరాజు అవినీతి బాగోతాలన్నీ ప్రజలకు తెలుసన్నారు. మత్స్యకారులను ఉద్ధరిస్తానని గతంలో ఆ శాఖ మంత్రిగా ఉండి టీ జెట్టీ కమ్ ఫిష్‌ల్యాండ్ సెంటర్‌ను మంచినీళ్లపేట దగ్గర రూ. 11.95 కోట్లతో మంజూరు చేసిన పనుల్లో కనీసస్థాయిలో పురోగతి సాధించారా. ఆ జెట్టీ ఏమయ్యింది? ఆ నిధులేమయ్యాయని ప్రశ్నించారు. ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? అందులో జరిగిన అవినీతి ఎంతనేది వెలికితీస్తే విస్తుపోయే నిజాలు బయటకొచ్చి అప్పలరాజు అసలురంగు బయటపడుతుందన్నారు. ఈ జెట్టీ పనుల్లో కేవలం రూ. 2.26 కోట్లు ఖర్చు చేశారని మిగిలిన సొమ్ము ఏమయ్యిందని ప్రశ్నించారు. అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదనడానికి ఇది ఓ ఉదాహరణని పేర్కొన్నారు. దండుకోవడంలో అప్పలరాజు సిద్ధహస్తుడని, పాల వెల్లువ కార్యక్రమంలో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ రాష్ట్రంలోని డెయిరీఫారాలను నాశనం చేశారని, పాడి రైతులను తొక్కేశారని ధ్వజమెత్తారు. గుజరాత్ నుంచి అమూల్ కంపెనీ తీసుకొచ్చి కోటానుకోట్లు కొట్టేశారని ఆరోపించారు. అలాగే పలాస మండలంలోని ఎం.ఐ.జి. లే అవుట్‌టో భూములు ఇచ్చిన రైతుల దగ్గర్నుంచి తన అనుచరులతో పది శాతం కమీషన్ తీసుకోలేదా ఈ తంతులో రూ. 2.5 కోట్లు దోచేశారని దుయ్యబట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పలాస నియోజకవర్గంలో కంకర కొండలను, మెట్టలను మింగేయలేదా అని ప్రశ్నించారు. ఇందుకు ప్రస్తుతం మైనింగ్ శాఖ రూ. 3.65 కోట్ల జరిమానా వేసిందందంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో ఇట్టే అర్థమవుతోందన్నారు. కిడ్నీ ఆస్పత్రి నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 50 కోట్లు మంజూరు చేస్తే, అందుకు అదనంగా మరో రూ. 30 కోట్లను వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిందని, నాలుగేళ్లలో ఒక మంత్రిగా ఉండి అక్కడ ఒక్క డయాలసిస్ యూనిట్ మంజూరు చేయలేదని ఆక్షేపించారు. ఇది ఆయన చేతగానితనానికి ఓ ఉదాహరణగా పేర్కొన్నారు. అయితే ఆ కాంట్రాక్టర్ దగ్గర రూ. 5 కోట్లు గుంజి ప్రజాసదన్ నిర్మించుకున్నారని విమర్శించారు. పలాస%-%కాశీబుగ్గలో షాపుల ఓపెనింగులను గౌరవంగా, ఉచితంగా ప్రారంభోత్సవాలు చేశారా? భార్య టాక్స్ పేరిట వసూళ్లకు పాల్పడ్డారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంకా బుద్ధి తెచ్చుకోకుండా ఇతరులపై బురద చల్లి లాభం పొందాలనుకుంటే అవివేకమవుతుందన్నారు. చేసిన పాపాలు వెంటాడుతున్నాయని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బాధితునికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, మార్చి11(వార్త):** ఈదుపురం గ్రామానికి చెందిన కరుణాకర్ బెహరా(35) ఇటీవల ప్రమాదంలో వెన్నెముఖకు దెబ్బతగిలి ప్రస్తుతం బరంపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితునికి భార్య కోమలి, ఇద్దరు పిల్లలు వున్నారు. ఆర్థికంగా పేదవారవటంతో ఈదుపురం బెహరా యూత్ సభ్యులు 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వైద్యఖర్చుల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో హంగీర్ బెహరా, రాము బెహరా , సాగర్ బెహరా, దూదిష్టి బెహరా, జయ బెహరా, ఇంద్రో బెహరా, ఢిల్లీ బెహరా తదితరులు పాల్గొన్నారు.

## మడ్డువలస కాలువలో ఇద్దరు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

**-కుమార్తె గల్లంతు**

**-తల్లి, కుమారుడు క్షేమం**

**-తీవ్రంగా గాలింపు చర్యలు**





**వంగర, మార్చి 11(వార్త):** వంగర మండలం కింజంగి గ్రామానికి చెందిన కళింగశ్రావణి (30), కుమారుడు సిద్ధార్థ అలియాస్ సిద్దు (9) కుమార్తె షైనీ (6) తో కలిసి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మడ్డువలస గ్రామం వద్ద గల మడ్డు వలస ప్రాజెక్ట్ కుడి కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దూకిన వెంటనే అరుపులు, కేకలు వినిపిస్తుండగా దగ్గర్లో ఉన్న సంగాం గ్రామానికి చెందిన జెన్నిజగన్ మోహన్ (చిన్న) స్నేహితులతో పరుగున వెళ్లి వెంటనే కాలువలోకి దూకి తల్లి ,కుమారుడు ను రక్షించగా కుమార్తె షైనీ ఆచూకీ లభించలేదు. వెంటనే వంగర మండల ఎస్సై షేక్ శంకర్ పోలీసులు బృందంతో కాల్వలో దిగి గాలింపు చర్యలు (వెతకడం) ప్రారంభించారు. స్థానికంగా మగ్గూరు గ్రమానికి చెందిన 5 గురు జాలర్లను తీసుకువచ్చి వెతికిన,వలలు తో గాలింపు చర్యలు చేపట్టిన షైనీ ఆచూకీ దొరకలేదని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. కింజంగి గ్రామానికి చెందిన కళింగశ్రావణికి 2014 లోపదేళ్ల కిందట బలిజిపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన సుధాకర్ తో వివాహమైంది. వారికి సిద్ధార్థ, షైనీలు పుట్టారు. శ్రావణి, సుధాకర్ లకు విభేదాలు రావడం వల్ల 6 ఏళ్ల గా శ్రావణి అత్తవారి ఇల్లు గంగాడ నుంచి కింజ%శీ%గి కన్నవారి ఇంటికి వచ్చి వేరుగా ఉంటుంది. ఆర్థిక సమస్యల భారం, భర్త నుండి విభేదాలు భర్త (మెంటల్ గా వ్యవహరించటం )రావడంతో శ్రావణి మనోవేదన చెంది పిల్లలతో ఆత్మహత్యకు ప్రయత్నించిందని ఎస్ఐ షేక్ శంకర్ వివరాలు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం 7 గంటల వరకు షైనీ కోసం గాలించిన ఆచూకీ లభించకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు సమాచారం ఇచ్చామని, పాప షైనీ ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు చేపడతామని ఎస్సైషేక్ శంకర్ తెలిపారు. అయితే ఈ రోజు తన సోదరి మన్యం జిల్లా బురద వెంకటాపురం గ్రామం నుండి పార్వతీ పురం మీదుగా పాలకొండ వచ్చిఅచ్చట నుండి రాజాం వచ్చి అచ్చటనుంచి నేరుగా మడ్డు వలస డ్యాం వద్ద కు వచ్చి కుడి ప్రధాన కాల్వలో మూకుమ్మడిగాముగ్గురూ తల్లీ పిల్లలు ఇరువురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలియజేశారు.



## ప్రచార యాత్ర విజయవంతం చేయాలి

**మందస, మార్చి 11(వార్త):** మందస, వజ్రపుకొత్తూరుల్లోని ఉద్దానం గ్రామాల్లో ఉద్దానంలో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పర్యటించింది. ఈ నెల 18, 19 తేదీల్లో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ, వామపక్ష పార్టీలతో కార్గో ఎయిర్‌పోర్ట్ పరిసర గ్రామాలలో జరిగే ప్రచార యాత్ర విజయవంతం చేయాలని నాయకులు కోరారు. పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసుదేవు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలాస నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, సిపిఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ స్టేట్ నాయకుడు వంకల మాధవరావు మాట్లాడుతూ ఈ ప్రచార యాత్రకు మాజీ ఎంఎల్సీ ఎంవి శర్మ, సీపీఐ, సీపీఎం, సిపిఐఎంఎల్, (ఎన్డీ) సిపిఐఎంల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శులు సిహెచ్ వెంకటరమణ, డి.గోవిందు, తాంద్ర ప్రకాష్, టి.సన్యాసిరావు పాల్గొంటారని తెలిపారు. పోరాట కమిటీ కార్యదర్శి అప్పారావు మాట్లాడుతూ 18వ తేదీన మందస, 19వ తేదీన వజ్రపు కొత్తూరు మండలాల్లో ప్రఛారం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్.రామస్వామి, చీకటి ధనుంజయ్ రావు, సీహెచ్ వల్లభరావు, రామ్మూర్తి, ఢిల్లీరావు, గుంటూరు రామారావు, జోగి శ్రీదేవి, విజయ, సంతోష్, రామారావు, హేమరాజు, దున్న హరికృష్ణ, గుంటు రామస్వామి, మైలపల్లి శేఖరం తదితరులు పాల్గొన్నారు.

## ఒడియా సంస్కృతి, భాష, విద్యాభివృద్ధికి కృషి



**మందస, మార్చి 11(వార్త):** ఒడియా సంస్కృతి, భాష, విద్య అభివృద్ధికి కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఒడిషా రాష్ట్రీయ భాషా దినోత్సవం మందసలో వేడుకలు ఒరియా యంగ్ మెన్స్ లైబ్రేరీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒడియా సంస్కృతి, భాష, విద్య నిర్వీర్యం కాకుండా ఐకమత్యంతో కృషి చేయాలని ఒడిషా రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి పూర్ణ చంద్ర మహాపాత్రో కోరారు. 1936 సంవత్సరం ఏప్రిల్ 1న ఆంధ్ర-ఒడిషా రాష్ట్రాల విభజనలో భాగంగా గంజాం జిల్లా నుంచి విడిపోయిన శ్రీకాకుళం జిల్లాలో వేలాది మంది ఒడియా మైనారిటీ ప్రజలు నివసిస్తున్నారన్నారు. స్థానిక జరిగిన ఈ వేడుకలలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో నివసిస్తున్న ఒడియా మైనారిటీ ప్రజల సంక్షేమం కోసం ఒడిషా ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని అన్నారు. ఉత్తరాంధ్ర ఒడియా మైనారిటీ అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ పాడి, దుర్గాప్రసాద్ పాణిగ్రాహీ లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఒడియా విద్య అభివృద్ధి చెందకుండా అడ్డంకులు ఉన్నాయని, ఒడియా పాఠశాలలను తెలుగు, ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో విలీనం చేయడం వలన,కొత్తగా ఒడియా పాఠశాలలు, ఒడియా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒడియా విద్య నిర్వీర్యం అవుతోందని, ఈ విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఒడియా కవులు రచించిన కవితలను చదివి వినిపించారు. కళాకారులు ప్రదర్శించిన ఒడియా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఒడిషా జగన్నాథస్వామి ప్రచారకుడు శరణ వింధ్ వజా, డాక్టర్ విద్యుత్ ప్రభాసాహు, భాస్కర్ పాడి, బృందావన దొళై, పవిత్రో మహారథ, సుజీన్ కుమార్ పండా, రవీంద్రకుమార్ పాడి, ప్రోదేష్ కుమార్ త్రిపాఠి, సింహాచలపతి, సంతోష్ కుమార్ పాణిగ్రహీ, జగదీష్ పండా, శ్రీనివాస పాడి తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ధర్నా




**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు సాయంత్రం 5 గంటలకు స్థానిక శ్రీకాకుళం సింహద్వారం వద్ద గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు అధికారులు ధర్నా చేపట్టారు. యునైటెడ్ ఫారం ఆఫ్ బ్యాంకు యూనియన్ కన్వీనర్ బి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం ఖండించకుండా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. బ్యాంకులలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తగినన్ని కేడర్లలో వెంటనే రిక్రూట్మెంట్ జరపాలన్నారు. ఐదు రోజుల పని దళాలను వెంటనే అమలు చేయాలన్నారు. రీజనల్ కార్యదర్శి కే.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు వారు వచ్చే జీతంపై టాక్స్ భరిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు మరల ఉద్యోగులకు వచ్చే రుణ సదు పాయాలపై కూడా టాక్సు వసూలు చేయాలనే దృష్టిలో బ్యాంకింగ్ యాజమా న్యాలు ఆలోచిస్తున్నాయని వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్ మాట్లాడుతూ శాశ్వత నియామకాలు మాత్రమే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ జి.కరుణ, ఇండియన్ బ్యాంక్ మహిళా కన్వీ నర్ శ్రావణి, కోఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఏ సూర్య , ఓబీసీ ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్ శ్రీనివాస్, ఉపేంద్ర, అధిక సంఖ్యలో అధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బెహరా మనోవికాస కేంద్రాన్ని సందర్శించిన బీహెచ్ఆర్సీ ప్రతినిధులు

**శ్రీకాకుళం, మార్చి 11(వార్త):** భారతీయ హ్యుమన్ రైట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు పూర్ణచంద్ర సాహు సోమవారం నగరంలోని స్థానిక బెహరా మనోవికాస కేంద్రాన్ని జిల్లా అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక సభ్యులతో కలిసి సందర్శించారు. అక్కడి నిర్వాహకులు శ్యామలతో మాట్లాడారు. అక్కడ వారు అందిస్తున్న సేవలు గూర్చి తెలుసుకున్నారు. వాస్తవాలను పరిశీలించారు. భారతీయ హ్యూమన్ రైట్స్ సంస్థ తరఫున వారికి ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తామన్నారు ఈ సందర్భంగా శ్యామల అందిస్తున్న సేవలను కొనియాడుతూ ఆమెను సత్కరించారు. జిల్లా కేంద్రంలో బెహరా మనోవికాస కేంద్రంలోని పిల్లలకు బాగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అలాగే తమ సంస్థ మహిళా ప్రతినిధులు మణిశర్మ, సౌజన్యలను మరిన్ని సేవా కార్యక్రమంలో ముందుకు సాగాలని తెలియజేస్తూ వారిని కూడా ఘణంగా సన్మానించారు. ఆయన వెంట తెలంగాణ, ఆంధ్రా రీజనల్ హెడ్ కొంక్యాన వేణుగోపాల్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, బెహర మనోవికాస కేంద్రం సిబ్బంది తదితరులు ఉన్నారు.



## నీటి ఎద్దడి తలెత్తనివ్వొద్దు



**ఇచ్ఛాపురం, మార్చి11(వార్త):** మున్సిపాలిటీలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మునిసిపల్ ఛైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కోరారు. మునిసిపల్ కమిషనరు రమేష్ మరియు ఇంజినీరింగ్ విభాగపు సిబ్బంది తో సమీక్షా సమావేశం ను ఏర్పాటు చేసారు ప్రస్తుతం పురపాలక సంఘ పరిధిలో గల వివిధ డ్రైన్ లు మరియు రోడ్ల యొక్క స్థితి ని , వార్డ్ లలో గల స్ట్రీట్ లైటింగ్ ల యొక్క స్థితి మరియు రానున్నది ఎండాకాలం అగుచున్నందున పుర ప్రజలకు త్రాగు నీటి కొరతను ఏ విధంగా అధిగామించాలని చెప్పారు. ప్రస్తుతం ఎండాకాలం అయినందున ప్రత్యేక ద్రుష్టి త్రాగు నీటి పై పెట్టవలెను అని అలానే వాటికి సంబంధించి పనులు రూ:2.00 లక్షలతో బహుదా నది లో ఎర్తేన్ బండ్ నిర్మాణం జరుగుచున్నదని,ఇంకొక వారం రోజులలో నిర్మాణం పూర్తికావోస్తున్నదని చెప్పారు.. అలానే 2 టాంకర్లతో పురుషోత్తపురం , ఎ.స్ పేట మరియు త్రాగు నీటి సరఫరా లేని వార్డులలో రోజుకు 10 ట్రిప్పుల చొప్పున త్రాగు నీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. పురపాలక సంఘం నందు బోర్ వెల్ లను మరమ్మతులు చేయుటకు గాను రూ:4.00 లక్షలను వెచ్చించి బోర్ వెల్ మెటీరియల్ కొనుగోలు చేయడం జరిగిందని త్వరలోనే వాటిని మరమ్మత్తులను చేసి త్రాగు నీటిని అందజేస్తామని, అలానే రానున్న కాలం లో ఎటువంటి పైప్ లైన్ మరమ్మత్తులకు, మునిసిపల్ వెహికల్ రిపేర్ లకు గాను ఒకేసారిగా అంచనాలను తయారు చేసి కౌన్సిల్ ముందు ఉంచాలని అన్నారు ప్రధాన రోడ్లు మరియు వార్డులలోగల స్ట్రీట్ లైటింగ్ కొరకు రూ:5.00 లక్షలు వెచ్చించి ఎల్ ఈ డి లైట్ లను కొనుగోలు చేయడం జరిగిందని మరియు వాటికి సరిపడా క్లాంప్, ప్యానెల్ బోర్డులు మరియు మొదలగు సామాగ్రిని కొనుగోలు చేయుటకు గాను అంచనాలను తయారు చేసి కౌన్సిల్ ముందు ఉంచవలెను అని చెప్పారు మరియు రోడ్లు మరియు డ్రైన్ లకు సంబంధించి 15 వ ఆర్థిక సంవత్సరం నకు గాను మొత్తం 61 వర్కులకు గాను 13 వర్కులు పూర్తి అయినవి 35 వర్కులు టెక్నికల్ సాంక్షన్ కొరకు సమర్పించియున్నాము, 3 టెండర్ స్టేజి లో ఉన్నవి, 10 వర్కులు ప్రోగ్రెస్ లో ఉన్నాయని చెప్పారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546